పశువుల ఆరోగ్యాన్ని గమనించాలి

రఘుపతిరెడ్డి, పశువైద్యాధికారి



ఆంధ్రజ్యోతి : సుల్తానాబాద్ మండలంలో పశువుల ఆస్పత్రులు ఎన్ని ఉన్నాయి?

వైద్యాధికారి: సుల్తానాబాద్ పట్టణం, చిన్నకలువల గ్రామంలో పశువుల ఆస్పత్రులు ఉన్నాయి. వీటి ద్వారా మండల వ్యాప్తంగా సేవలందిస్తున్నాం. రైతులకు అందుబాటులో తొగర్రాయి, గర్రెపల్లి గ్రామాలలో సబ్ సెంటర్‌లు ఉన్నాయి

ఆంధ్రజ్యోతి : చలికాలంలో పశువులకు ఎలాంటి జబ్బులు వస్తాయి.

వైద్యాధికారి: చలికాలంలో పశువులకు, న్యూమెనియా, గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు సోకుతాయి. సరైన సమయంలో వీటికి వైద్యం అందించాలి.

ఆంధ్రజ్యోతి : వ్యాధి లక్షణాలు ఎలా తెలుస్తాయి.

వైద్యాధికారి: పశువుల యజమానులు అప్రమత్తంగా ఉంటూ వాటి ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉండాలి. పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా, జబ్బులు వచ్చినా సమీప పశువైద్యులను, సహాయకులను సంప్రదిస్తే చికిత్స అందిస్తాం.

- సుల్తానాబాద్

దరఖాస్తుల వెల్లువ

- నాలుగు పథకాలకు 52,326 దరఖాస్తులు
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు అధికం
- నేటి నుంచి నాలుగు పథకాలు ఆరంభం


కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామంలో గ్రామసభ(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో మొత్తం 52,326 దరఖాస్తులు వచ్చాయి. కొత్త పథకాల ద్వారా ఎంపిక చేసిన పలువురు లబ్ధిదారులకు ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా చెక్కులను అందజేయనున్నారు.

● యేడాది క్రితం దరఖాస్తుల స్వీకరణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఏడాది క్రితం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల ద్వారా ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దశల వారీగా ఆయా పథకాలను అమలు చేస్తూ వస్తున్నది. మొదటి విడతలో ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 10,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, సొంత స్థలం గల లబ్ధిదారులనే ఎంపిక చేసి గ్రామసభ ఆమోదం కోసం పెట్టనున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,80,664 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,28,972 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాల్లో 61,692 దరఖాస్తులు వచ్చాయి. సాగులో ఉన్న భూములకే ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించిన మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి సాగు భూములను గుర్తించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం సర్వే నిర్వహించి అర్హులను గుర్తించారు. వీటిపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. ఈ సభల్లో ప్రభుత్వం ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లు లేవని అధికారులను నిలదీయడంతో పాటు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏడాది క్రితం ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షా 80 వేల దరఖాస్తులు రాగా, ఆ మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఇందిరమ్మ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. రేషన్ కార్డుల కోసం గతంలో వచ్చిన 15,255 దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని సర్వే చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా 20 రోజుల పాటు పనులు చేసిన కూలీలను గుర్తించారు. అందులో ఎలాంటి భూమి లేని వారికి ఏడాదికి రూ.12

మిగతా 8వ పేజీలో...

21 నుంచి 23 తేదీల్లో వచ్చిన దరఖాస్తులు	
రేషన్ కార్డులకు	25,693
ఇందిరమ్మ ఇళ్లకు	15,528
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	9,890
రైతుభరోసా కోసం	1215
మొత్తం 52,326 దరఖాస్తులు వచ్చాయి.	

కాలుష్యపు కోరల్లో రామగుండం



- ఎన్టీపీసీ విస్తరణకు సన్నాహాలు
- ఈ నెల 28న మరో 3యూనిట్లకు ప్రజాభిప్రాయ సేకరణ
- ఇప్పటికే ప్రమాద స్థాయిని దాటిన ఏక్యూఐ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణవేత్తలు

సింగరేణి గనులు, ఓసీపీలు, ఎన్టీపీసీ, పలు పరిశ్రమలతో రామగుండం కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. ఇప్పటికే 110 నుంచి 200 వరకు ఏక్యూఐ (ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్) వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన పరిమితులను ఈ ప్రాంతంలో మూడు రెట్లు దాటిపోయింది. ఈ క్రమంలో ఎన్టీపీసీ మరో మూడు విద్యుత్ కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రజాభిప్రాయం జరుగుతుండడంతో ప్రజలు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి):

6

సన్మానాలు.. భావోద్వేగాలు...

- రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, సుల్తానాబాద్ చివరి మున్సిపల్ సమావేశాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్

రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల కాలపరిమితి ముగిసింది. శనివారం చివరి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు పాల్గొని కౌన్సిల్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు భావోద్వేగానికి గురయ్యారు.


రామగుండంలో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్‌తో కౌన్సిల్ సభ్యులు, పెద్దపల్లిలో చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామగుండంలో అభివృద్ధి నా బాధ్యత అని, నియోజకవర్గం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అందరి అభిప్రాయాలు, సహకారంతో ముందుకు పోతానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలకవర్గ చివరి సమావేశం శనివారం మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండంలో అభివృద్ధిలో, సంక్షేమ ఫలాలు అందించడంలో రాజకీయ వివక్ష చూపేది లేదని, పేదవాడైతే చాలు ఏ పార్టీ వారైనా సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. గతంలో ఇద్దరు ఎమ్మెల్యే డబుల్ బెడ్‌రూమ్‌లను రాజకీయాల కోసం వాడుకున్నారని, లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వలేదన్నారు. గతంలో కేటాయింపులు జరిగిన లబ్ధిదారులకే ఇండ్లు కేటాయించామన్నారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు గతంలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లేవని, ఇప్పుడు పరిశ్రమలపై ఒత్తిడి తెస్తున్నానన్నారు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సహకారంతో రామగుండాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నెల రోజుల్లో రుడా కార్యరూపంలోకి వచ్చే అవకాశం ఉందని, మెడికల్, బిజినెస్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు.

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపాల్టీ కౌన్సిలర్ల పదవికాలం ముగియడంతో మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో 36 మంది కౌన్సిలర్లను సన్మానించారు. చైర్‌పర్సన్ డా.దాసరి మమత రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరయ్యారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పెద్దపల్లి పట్టణానికి టీయూఎఫ్ఐడీసీ, డీఎమ్ఎఫ్టీ నిధులతో అభివృద్ధి జరిగిందన్నారు. సహకరించిన మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధతతో పని చేసినప్పుడే ప్రజల గుర్తింపు లభిస్తుందన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్ రెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కమిషనర్ ఆకుల వెంకటేష్, చైర్‌పర్సన్ ఎమ్మెల్యేను సన్మానించారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్‌టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్,అకౌంటెంట్ నాగవేణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు ప్రజాదరణ పొందేలా వ్యవహరించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ వీడ్కోలు సమావేశం

మిగతా 8వ పేజీలో...

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం

● ఈనెల 28న ఎన్టీపీసీ బంద్ ● మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


విలేకరులతో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

జ్యోతినగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భూ నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై ఎన్టీపీసీ యాజమాన్యం స్పష్టత ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శనివారం ఎన్టీపీసీలో జరిగిన విలే కరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చందర్ మాట్లాడారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు స్టేజ్ 2 నిర్మాణానికి ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, ఆ రోజున ఎన్టీపీసీలో బంద్ పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాం తంలోని 17 గ్రామాల రైతులు, ప్రజలు 10 వేల ఎకరాలను ఎన్టీపీసీకి అప్పగించారన్నారు. భూములు సేకరించే ముందు ఎన్నో హామీలిచ్చిన ఎన్టీపీసీ వాటిని అమలు చేయడంలో విఫల మైందన్నారు. పునరావాస కాలనీలు నెలకొల్పినప్పటికీ కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. ప్రస్తుతం 800 మంది మాత్రమే పర్మినెంటు, 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఎన్టీపీసీలోని పాఠశాలల్లో ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కూడా కల్పించడం లేదన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ప్రభావిత ప్రాంత ప్రజలు, కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, భూనిర్వాసితులు, స్థానికులకు తెలంగాణ ఎన్టీపీసీలో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా కుందనపల్లిలో నిర్మించనున్న యాష్‌పాండ్ వల్ల కాలుష్యం ప్రభావానికి గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ అభిషేకరావు, కార్పొరేటరు కుమ్మరి శ్రీనివాస్, కృష్ణవేణి, బీఆర్ఎస్ నాయకులు బుర్ర శంకర్‌గౌడ్, ఈదునూరి శంకర్, పర్వతాలు, అనిల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ఓటరు గుర్తింపు కార్డు ఇస్తున్న అదనపు కలెక్టర్

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

- అదనపు కలెక్టర్ డి.వేణు

8

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


గణతంత్ర వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్ మైదానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని కలెక్టరేట్ మైదానం ముస్తాబవుతోంది. ఆదివారం జరిగే వేడుకలకు పోలీస్ గౌరవ వందనం, శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐడీవోసీ మైదానంలో జరిగే వేడుకలో తొమ్మిది గంటలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీస్ గౌరవవందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతారు. జిల్లాలో ప్రతిభను చూపించిన అధికారులకు ప్రశంసా పత్రాల పంపిణీ జరుగుతుంది. సాయంత్రం సమావేశ మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్ల పనులు పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు మార్చి మొదటి వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను సూచించారు. శనివారం కూనారం రోడ్డు సమీపంలో నిర్మించిన ఇండ్ల సముదాయాన్ని సందర్శించారు. పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చివరి దశ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, తాగు నీటి సరఫరా, డ్రైనేజీ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, మార్చి మొదటి వారంలో లబ్ధిదారులకు ఇండ్లు అప్పగించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏ.ఈ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో రంగారావు

పెద్దపల్లిటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆర్టీవో టి.రంగారావుతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మన నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు నష్టపోతున్నారని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా చూసుకోవాలని, వాహనాల ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం. మధు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పథకాల ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు

పెద్దపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. శనివారం కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రేషన్ కార్డుల జారీ పథకాలను ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజాపాలన ప్రారంభించే గ్రామాల జాబితా, లబ్ధిదారుల వివరాలను నిర్ణీత నమునాలో పంపాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలను ప్రారంభించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, సదరు గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. అధికారులు, పాల్గొన్నారు.

ఆర్మీ ప్రవేశ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ ప్రవేశ పరీక్ష శిక్షణకు ఆసక్తి గలవారు ఫిబ్రవరి 10లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో వెలువడే ఆర్మీ నోటిఫికేషన్‌ను పురస్కరించుకుని ఉచిత వసతితో కూడిన శిక్షణను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఆపై చదివి 17-21 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8309435264, 8333044460, 9573688952 సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● గొల్లపల్లి యువకుడి దుర్మరణం



గంగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికిచెందిన యువకుడు మ్యాకల గంగరాజు(26) హైదరాబాద్‌లో ఈనెల24న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడని కుటుంబసభ్యులు, స్థానికులు శనివారంతెలిపారు. గ్రామంలోని మ్యాకల మల్లవ్వ-దేవయ్య దంపతుల ఒక్కడే కొడుకైన గంగరాజు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో బైక్‌మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల24న రాత్రి పనులు ముగించుకుని గదికి వెళ్తున్న క్రమంలో వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లిపోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు మల్లవ్వ, దేవయ్య, వివాహమైన ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

చికిత్సపొందుతూ మృతి

ఇల్లంతకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామానికిచెందిన అట్ల నాగభూషణం(48) చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్థులుతెలిపిన వివరాలప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఇల్లంతకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని మొదట సిద్దిపేటకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

గంభీరావుపేట జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట కమాన్ వద్ద గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నాగంపేట కమాన్ వద్ద ఒక వ్యక్తి బస్సులో వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అతనివద్ద 110గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. అతన్ని విచారించగా కరీంనగర్‌జిల్లా గంగాధర మండలం ముప్పిడిపల్లి గ్రామానికి చెందిన కల్లపల్లి శ్రీనివాస్‌గా తేలిందన్నారు. నెలరోజుల క్రితం మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి అందులో కొంచెం తాగి మిగిలినది అధిక ధరకు అమ్మడానికి వచ్చినట్లు నిందితుడు తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడిపై కేసు

బీర్‌పూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. మంచిర్యాలజిల్లా జన్నారం మండలం కలమడుగు (పోచమ్మగూడెం)కు చెందిన పరచ సురేందర్(26) అనే యువకుడు శనివారం బీర్‌పూర్ మండలంలోని మంగేళ ఎక్స్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీచేయగా 500గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్ చేసి సురేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టార్టర్ ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

శంకరపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలం కన్నాపూర్ గ్రామంలోని వ్యవసాయబావి వద్ద కరెంటు మోటర్ స్టార్టర్ ఉండే బాక్స్ తాళం పగలగొట్టి స్టార్టర్, ఆటోమెటిక్ స్టార్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతు కంతాల విష్ణు శనివారం తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలుష్యపు కోరల్లో రామగుండం



గోదావరిఖని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలపై మరో పిడుగు పడనున్నది. సింగరేణి గనులు, ఓసీపీలు, ఎన్టీపీసీ, పలు పరిశ్రమలతో రామగుండం కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. ఈ క్రమంలో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంను రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 800/5 4000 మెగావాట్ల ఐదు సూపర్ థర్మల్ యూనిట్ల ఏర్పాటుకు ఎన్టీపీసీ సిద్ధమైంది. ఇందులో 800/2 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 800/3 యూనిట్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.29,345 కోట్లు మంజూరు చేసింది. ఈ యూనిట్ల నిర్మాణ అనుమతుల నేపథ్యంలో పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయాన్ని ఈ నెల 28న ఎన్టీపీసీ జెడ్పీ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్ష్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగనున్నది. ఈ మూడు యూనిట్లు ప్రారంభమైతే ఈ ప్రాంతం లో వాతావరణ కాలుష్యం పెరిగి మనుగడనే ప్రశ్నార్థకం చేసే స్థాయికి చేరుకుంటోందని ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగ కుండా ఈ ప్రాంతంపై జరుగుతున్న పారిశ్రామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు.

● ఉపాధి, ఉద్యోగాలు

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఎన్టీపీసీ విడుదల చేసిన నివేదికలో 800/3 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 96శాశ్వత ఉద్యోగాలు, 216 కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. అయితే ప్లాంట్ల నిర్మాణ సందర్భంలో మాత్రం రెండేళ్ల పాటు 3వేల మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొంది. భారీ విద్యుత్ ప్లాంట్‌లో ఈ ప్రాంత ప్రజ లకు ఉపాధి, ఉద్యోగాల ప్రయోజనాలు కూడా కలుగడం లేదు.

● రోజూ లక్ష టన్నుల బొగ్గుమండుతున్నది...

ఎన్టీపీసీలో పాత 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రోజూ 40వేల టన్నుల బొగ్గు మండిస్తున్నారు. తెలంగాణ సూపర్‌థర్మల్ మొత్తం 4000మెగావాట్ల సామర్థ్యానికి రోజూ 60వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుంది. అంటే రోజూ లక్ష టన్నుల బొగ్గు ఇక్కడ మండుతుంది. ఒక టన్ను బొగ్గును మండించడం వల్ల ప్యాటుకులేట్ మ్యాటర్(అతి సూక్ష్మ దుమ్ము, ధూళికణాలు) మూడు కిలోలు వెలువడుతాయి. గాలిలో చేరడం వల్ల ఆక్సిజన్ బరువుతో వెయ్యి కిలోలు దాటి దుమ్ము, ధూళి కణాలు వాతావరణంలోకి వస్తాయి. ఇదే టన్ను బొగ్గు కాల్చడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వాతావరణంలో కలిసిపోతాయి. ఇవి ఈ ప్రాంత భూతాపాన్ని పెంచడంతో పాటు దీర్ఘకాలిక వాతావరణ ప్రతికూల పరిస్థితులను పెంపొందిస్తాయి. ఒక టన్ను బొగ్గు మండించడంతో సల్ఫర్ ఆక్సైడ్ కూడా 4కిలోలు వెలువడుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతోంది. ఎన్టీపీసీ చెబుతున్న లెక్కల ప్రకారమే బొగ్గు మండించడం వల్ల బొగ్గు నాణ్యతను బట్టి 40శాతం వరకు బూడిద బయటకు వస్తుంది. టన్ను బొగ్గుకు 400 కిలోల బూడిద బయటకు వస్తుంది. యేటా 36.5 మిలిటన్నుల బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తే వాతావరణ కాలుష్యం దెబ్బతినే అవకాశం ఉంది.

● డబ్ల్యూహెచ్‌ఓ చెబుతున్నది ఏమిటి...

ప్రపంచ ఆరోగ్య సంస్థ గాలిలో 15మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉండాలని చెబుతున్నది. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి 50మైక్రో గ్రాములు ఉండవచ్చు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే 110 మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉందని, ఇది 200, 360వరకు చేరుతున్నదని చెబుతున్నారు. ఈ కారణంగా క్యాన్సర్, గుండెపోట్లు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

● ఒక్క ఎన్టీపీసీకే యేటా 5టీఎంసీల నీరు...

ఎన్టీపీసీ పాత యూనిట్లు, తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు 4000మెగావాట్ల సామర్థ్యం కలిసి సంవత్సరానికి 5టీఎంసీల నీటిని వినియోగిస్తున్నది. నీటిని అతి ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించడం వల్లనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటికే 250 క్యూసెక్కుల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఎన్టీపీసీ ఏర్పాటు చేసుకుంది. శ్రీపాద ప్రాజెక్టు నుంచి రూ.180కోట్ల పెట్టుబడితో నీటి వాటాను తీసుకుని తెలంగాణ ప్రాంత వ్యవసాయ రంగ నీటి అవసరాలపై కూడా ఎన్టీపీసీ ప్రభావం చూపుతున్నది.

● పీపీఏపై అనుమానాలు...

కొత్తగా 2400మెగావాట్ల మూడు యూనిట్లపై పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ)పై స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త యూనిట్ల కేవలం 800మెగావాట్లు మాత్రమే రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తీసుకుంటామని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిసింది. ఎన్టీపీసీ వెయ్యి మెగావాట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 600మెగావాట్లు కేంద్ర ప్రభుత్వ సూచనలతో అమ్మేందుకు సమాలోచిస్తున్నట్లు సమాచారం.

● ఎన్టీపీసీ వద్ద 11వేల ఎకరాలు...

రామగుండం ఎన్టీపీసీ నిర్మాణంతో ఈ ప్రాంతంలోని తొమ్మిది పల్లెలు కాంక్రీటు వనంలా తయారయ్యాయి. ఎన్టీపీసీ నిర్మాణం కోసం 10,800 ఎకరాలను భూసేకరణ చేసింది. దీంతో మేడిపల్లి, రాణాపూర్, ఎల్కలపల్లి, లక్ష్మీపురం, శాలపల్లి, పొరట్‌పల్లి, మల్యాల పల్లి, రాజాపరం, కుందనపల్లి ఊర్లు ప్రభావితమ య్యాయి. ఈ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, పశుసంపద, భూగర్భ జల సంపద దెబ్బతిన్నది.

● ఒకే చోట 8వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి...

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగానే 8000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగడం పారిశ్రామిక అభివృద్ధి పరంగా గొప్ప విషయమే అయినా మానవ మనుగడను ప్రశ్నార్థకం చేసే వాతావరణ కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే ఎన్టీపీసీలో 500/4, 200/3 మొత్తం 2600మెగావాట్లను ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు కింద 800/2 ఉత్పత్తి జరుగుతుంది. సింగరేణి జైపూర్ ప్లాంట్ 600/2 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు ఎన్టీపీసీలో మరో 800/3మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పర్యావరణ అనుమతులు జరుగుతున్నాయి. సింగరేణి, ఎన్టీపీసీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. పైగా జైపూర్‌లో 800/1, జెన్‌కో ద్వారా రామగుండంలో 800/1 థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నది.

'బ్రాహ్మణ పరిషత్ విదేశీ విద్యానిధి పథకం రుణాలు విడుదల చేయాలి'

కరీంనగర్ కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమపరిషత్‌కు మంజూరైన 40కోట్ల నుంచి విదేశీ విద్యానిధి పథకానికి నిధులు విడుదల చేయాలని భారతీయ బ్రాహ్మణఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాంభట్ల దీపక్‌బాబు ఒకప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మూడు సంవత్సరాలుగా బ్రాహ్మణ సంక్షేమపరిషత్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రుణాలు మంజూరుచేస్తే లబ్ధిదారులు ఆయా యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. సకాలంలో రుణాలు మంజూరు కాకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, పేద బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు.

ఐక్యతా రాగం.. ఆపైన విమర్శలు

● స్మార్ట్‌సిటీ ఘనత తమదేనని చెప్పుకున్న నేతలు
● ఆసక్తికరంగా ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'నాకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో బేదాభిప్రాయాలు లేవు.... అందరం కలిసి కరీంనగర్ అభివృద్ధికి కృషిచేస్తాం.. జెండాలు, ఎజెండాలు, పార్టీలను పక్కన బెట్టి కరీంనగర్ అభివృద్ధికి పాటుపడతాం' అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐక్య తారాగాన్ని ఆలపించడం జిల్లారాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరతీసింది. బండి సంజయ్‌కుమార్ ప్రసంగించిన వేదికపైనేవచ్చిన స్మార్ట్‌సిటీ ప్రస్తావన నేతల అంతరంగాలను ఆవిష్కరించింది.

స్మార్ట్‌సిటీకి నిధులు తీసుకువచ్చి, కరీంనగర్‌ను అభివృద్ధి చేసింది కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారేఅని మేయర్ యాదగిరిసునీల్‌రావు అన్నారు. ఆ క్రెడిట్‌ను ఆయనఖాతాలో వేయడానికి అంగీకరించని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ బోయినపల్లివినోద్‌కుమార్ చేసిన కృషితోపాటు తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి కూడా కారణమని అన్నారు.

మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగులకమలాకర్ మాట్లాడుతూ ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ వినోద్ కుమార్‌తోకలిసి తాను ఢిల్లీవెళ్లి స్మార్ట్‌సిటీ జాబితాలో కరీంనగర్‌ను చేర్పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించిందని స్మార్ట్‌సిటీని తమఅకౌంట్‌లో వేసుకున్నారు.

అటుబీజేపీ, ఇటుకాంగ్రెస్, బీఆర్‌ఎస్‌నేతలు ఎవరికివారు స్మార్ట్‌సిటీని తేవడం తమ ఘనతేనని చెప్పుకోవడంతో స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అక్రమాల మాటేమిటనే చర్చ జోరుగా సాగుతున్నది. బీఆర్‌ఎస్ మేయర్‌గా సునీల్‌రావు, ఎమ్మెల్యేగా, మంత్రిగా గంగుల కమలాకర్, ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఉన్న సమయంలో స్మార్ట్‌సిటీ పనులు జరిగాయి. ఈ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన విషయాన్ని నగర ప్రజలు గుర్తుచేసుకొని చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన పనులతోపాటు మానేరు రివర్‌ఫ్రంట్‌పనుల్లో అక్రమాలు జరిగాయని విచారణ చేపిస్తామని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు అలా ఉండగానే మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరాయి. మామధ్య ఎలాంటి విబేధాలులేవు కలిసి పనిచేస్తామంటూ కేంద్రమంత్రి పేర్కొనడంతో స్మార్ట్‌సిటీ అవినీతిఅంశం అటకెక్కినట్టేనా అని అనుకుంటున్నారు.

మెట్‌పల్లి సీఐకి ఇండియన్ పోలీస్‌మెడల్



సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యున్నత సేవలు అందించే ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఇండియన్ పోలీస్ మెడల్‌కు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఎంపికయ్యారు. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డికి హైదరాబాద్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో ఇండియన్ పోలీస్‌మెడల్‌ను ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేకేనగర్‌లో కార్డన్ సెర్చ్

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకట్రావ్‌పల్లె పంచాయతీ కేకేనగర్‌లో శనివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున పోలీస్ బృందాలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి సీఐ ప్రసాదరావు మాట్లాడారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహన దారులు అన్ని రకాల ధృవీకరణ పత్రాలు కల్గి ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ-2 లింగమూర్తి, ఎస్సైలు ప్రసాద్, రవళి, సిబ్బంది కలీల్, కృష్ణారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద యజమానులతో మాట్లాడుతున్న సీఐ

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్‌తండాకు చెందిన తేకల సౌజన్య అత్తంటి వేధింపులు భరించలేక ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అస్వస్థతకుగురైన సౌజన్యను కుటుంబసభ్యులు గోదావరి ఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహ త్యాయత్నానికి ముందు సెల్ఫీ వీడియో తీసింది. సౌజన్య భర్త అనురాగ్ ఏడాదిక్రితం గుండెపోటుతో మరణించాడు. తండ్రిఉద్యోగం వచ్చే క్రమంలోనే అనురాగ్ మృతిచెందాడు. తమకు రావాల్సినఉద్యోగం అత్త మామలు కుమార్తెకు ఇప్పించుకుని తనకు అన్యాయం చేశారని, ఎటువంటి ఆధారంలేని తనను నిత్యంసూటి పోటీమాటలతో వేధించడంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడుతు న్నట్టు సౌజన్య వీడియోలో పేర్కొన్నది.

విద్యార్థినికి పలువురి సన్మానం

గన్నేరువరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇంగ్లీష్ ఉపన్యాసపోటీలో మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలకుచెందిన విద్యార్థిని పత్తి వైశాలి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో పలువురు నాయకులు శనివారం విద్యార్థినిని, ఉపాధ్యాయబృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రామయ్య, నాయకులు పుల్లెలజగన్, వేణుగోపాల్, కాంతాల అంజిరెడ్డి, సందవేణి ప్రశాంత్, రేపాకబాబు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సంపత్(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై లారీఢీకొని ఒకరు మృతి చెందారు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన గట్టు సంపత్(24) అలుగునూరులోని రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. పర్లపెల్లిలో తన అన్నతో కలిసి ఉంటున్నాడు. శనివారం గట్టు సంపత్ కొత్తపల్లి శివారులో కరీంనగర్ వైపు వస్తూ రోడ్డుకు పక్కన తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి డివైడర్ పైనుంచి రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు బూడిదలోడుతో వెళుతున్న లారీ సంపత్‌ను ఢీకొంది. దీంతో సంపత్ లారీ టైర్ కింద పడగా తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

మల్యాల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో బావమరుదులపై బావ కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన గుండోజి చంద్రశేఖర్‌తో జగిత్యాలకు చెందిన అనసూరి నవ్య వివాహం 2021లో జరిగింది. ఏడాది తరువాత కుటుంబ కలహాలతో జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఇరు కుటుంబాల మధ్య ఆదివారం పంచాయితీ ఉంది. ఈ నేపథ్యంలో శనివారం నవ్యతో పాటు ఆమెతండ్రి, సోదరులు ముత్యంపేటకు వచ్చారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి దాడులకు దారి తీసింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ తన బామ్మర్దులు శివసాయి, నవీన్‌కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు.

బాధితుల ఫిర్యాదుతో ఎస్సై నరేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

● 35తులాల బంగారం, 80తులాల వెండి, రూ.3.50లక్షల నగదు దొంగతనం
● రంగంలోకి దిగిన రెండు పోలీసు టీంలు
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన టౌన్ ఏసీపీ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో తాళంవేసిన ఇంటిలో శనివారం గుర్తు తెలియని దొంగలు చొరబడి భారీగా బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించుకుపోయారు. కరీంనగర్ ఒకటోటౌన్ సీఐ బిల్లకోటేశ్వర్, బాధితులు కథనం ప్రకారం.. సహకారశాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందిన మురుగం అంజని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరుకూతుళ్లు ఉన్నారు. మురుగం అంజని ఇంటికి తాళంవేసి తన సోదరుడితో కలిసి శనివారం ఉదయం వరంగల్‌కు వెళ్లింది. పనిముగించుకుని సాయంత్రం తిరిగి కరీంనగర్‌కు వచ్చింది. ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి వేసిన తాళం వేరేది ఉంది. పక్కనే ఉంటున్న ఆమె తల్లిని అడగగా తలుపులు తెరచి ఉండటంతో తానే తనవద్ద తాళం వేశానని తెలిపింది. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉంది. బీరువాలో భద్రపరిచిన 35తులాల బంగారు ఆభరణాలు, 80తులాల వెండి ఆభరణాలు, రూ.3 లక్షల 50వేలనగదు కనపడలేదు. ఇంటిలో మరోచోట భద్రపరిచిన మరికొంత బంగారం మాత్రం భద్రంగానే ఉంది. గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాలోని బంగారం, వెండి, నగదు దొంగిలించు కుపోయారని బాధితురాలు కరీంనగర్ ఒకటోటౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఏసీపీ వెంకటస్వామి పరిశీలించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. చోరీజరిగిన ఇంటి సమీపంలోని పలు సీసీకెమెరాలను పోలీసు టీంలు తనిఖీ చేస్తున్నాయి. నిందితులను పట్టుకునేందుకు రెండు పోలీసు టీంలు రంగంలోకి దిగి పలువురు అనుమానితులను విచారిస్తున్నారు. పగటిపూటనే భారీ దొంగతనం జరగడంతో తెలిసినవారే ఈచోరీ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పలుకోణాల్లో విచారణ జరుపుతున్నారు.

బైపాస్ రోడ్‌లో అఘోరీమాత హల్‌చల్



పెద్దపల్లి బైపాస్‌రోడ్‌లో కారు వద్ద నిలుచున్న అఘోరీమాత

కరీంనగర్ క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వార్తల్లో నిలుస్తున్న అఘోరీ మాత శనివారం రాత్రి కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. కారులో వెళతుండగా కొందరు అకతాయిలు అఘోరీమాతను అడ్డుకుని సెల్ఫీ తీసుకోవాలని ఒత్తిడి తేవటంతో వాగ్వాదం జరిగింది. ఆకతాయిలు ఆమె కారుకు వారి కారును అడ్డుపెట్టి అడ్డుకున్నారు. 100కు కాల్ చేయటంతో సమాచారం అందుకున్న కరీం నగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తన సిబ్బందితో సహాఅక్కడికి చేరుకుని అఘోరీమాతను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా ఆమె పెద్దపల్లి వైపు తన కారులో వెళ్లింది. అఘోరీ కరీంనగరలోనే రెండు రోజులుగా ఉంటున్నట్లు సమాచారం. పోలీసుల రాకను గమనించిన ఆకతాయిలు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. కారును పోలీసులు ఠాణాకు తరలించారు.

డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తి అరెస్టు

శంకరపట్నం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చిట్‌ఫండ్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినవ్యక్తిని కేశవపట్నం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డికి హుజూరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన చిట్‌ఫండ్ నిర్వాహకుడు వేముగంటి శ్రీనివాస్‌ద్వారా రూ.4.64లక్షలు రావాల్సిఉంది. చిట్టిడబ్బులు ఇవ్వకుండా మోసం చేసినందుకు చిట్‌ఫండ్ యాక్టులో కేసు నమోదు చేసి, వేముగంటి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి హుజూరాబాద్ కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన సూరఉదయ్‌కిరణ్(24) అనే యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సైఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఉదయ్‌కిరణ్ ఈనెల 21న తన స్నేహితుడు కనుకుంట్ల రవితేజతోకలిసి ద్విచక్ర వాహనంపై కొండాపూర్ వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈసంఘటనలో ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలుకాగా కరీంనగర్ ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడితండ్రి కుమార స్వామిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. వాహనాలతనిఖీల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఓ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, అనుమతి పత్రాలు చూపాలన్నారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో అదుపులోకి తీసుకొని డ్రైవర్ ఏరుకొండ మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయవిక్రయాల కేసులో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో నలుగురిని శనివారం అరెస్ట్‌చేశామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ సమీపంలోగల శ్మశానవాటిక వద్ద గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న సాయినగర్‌కు చెందిన షేక్‌షారుక్‌ఖాన్(25), శాంతినగర్‌కుచెందిన మూషం శివకుమార్(22), గడదాస్‌శివ(24), బివైనగర్‌కు చెందిన మహ్మద్‌గౌస్(22)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. వీరివద్ద 200గ్రాముల గంజాయిని, నాలుగు మొబైల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాలుగురోజుల క్రితం కరీంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లి రూ.10వేలకు 400 గ్రాముల గంజాయిని షేక్‌షారుక్ ఖాన్ కొనుగోలుచేసి సిరిసిల్లలోని తన పరిచయస్తులకు 150గ్రాముల గంజాయిని విక్రయించాడన్నారు. మిగిలిన 250గ్రాముల గంజాయిని తనవద్దనే పెట్టుకొని 50గ్రాముల ప్యాకెట్లు చేసుకున్నాడన్నారు. ఇందులో 50 గ్రాముల గంజాయినితాగి మిగతా మూడు ప్యాకెట్లు మూషం శివకుమార్, మహ్మద్ గౌస్, గడదాస్‌శివకు రూ.4500కు విక్రయించాడన్నారు. ఇదేసమయంలో సమాచారం రావడంతోవెళ్లి అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసి నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసినా కొనుగోలుచేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మోదీ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటాలి - కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటి రెండు స్థానాలను కైవసం చేసుకునే దిశగా పనిచేయాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు అభ్యర్థించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో చేసిన మోసాలను ఓటర్లకు వివరించాలన్నారు. నిరుద్యోగభృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ పెంపు, 317 జీవో సవరణ, డీఏ బకాయిల చెల్లింపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిన అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డిలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరిచయం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీమేయర్ డి శంకర్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ ద్వారా ఖైదీల పిల్లలకు సాయం అందిస్తాం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీ ల పిల్లలకు లీగల్ ఎయిడ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ అన్నారు. శనివారం కరీం నగర్ జైలులో ఖైదీల హక్కులు, బాధ్యతలు, ఖైదీలకు అందిస్తున్న న్యాయసేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ మాట్లాడుతూ ఖైదీలు పిల్లల చదువు నిర్లక్ష్యం చేయవద్దని, వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్య అందించాలన్నారు. ఖైదీలు మానసికంగా దృఢంగా ఉండాలని, అధైర్య పడకూడదని సూచించారు. ముద్దాయిలు స్వయంగా, వ్యక్తిగతంగా మార్పు చెందాలని అన్నారు. పేద ఖైదీలకు ప్రభుత్వ న్యాయ వాదులను నియమించి న్యాయ సహాయాన్ని అందిస్తామని అన్నారు. ఖైదీల హక్కులు, బాధ్యతలను వారికి అందిస్తున్న న్యాయ సహాయం గురించి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఖైదీలు నేరాలు చేయకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత కొత్త జీవితాన్ని ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల గురించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జైలు అధికారులను, సిబ్బందిని అభినందించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ మాట్లాడుతూ జైలుకు వచ్చిన ఖైదీల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయ సేవా పరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని, లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా లీగల్ అడ్వకేట్‌లను జైలుకు పంపించి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ కె శ్రీనివాస్, జైలు వైద్యాధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, యు పరశురాం, డిప్యూటీజైలర్‌లు ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్ నాయక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, పి పరశురాములు, ఎస్ మల్లేశం, జ్యోతి, ఖైదీలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో రాచర్ల కోట


అనవాళ్లు కోల్పోయిన రాచర్లకోటలోని సింహ ద్వారం(వెనుక దిడ్డి)

- కాల గర్భంలో కనుమరుగవుతున్న అద్భుత కట్టడం
- నాటి నైపుణ్యానికి స్మృతి చిహ్నంగా శిల్ప ఖండాలు
- మాయమవుతున్న చారిత్రక సంపద.. పట్టించుకునే వారు కరువు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రాచీన వారసత్వ సంపదకు ఆదరణ కరువైంది. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోట నిర్లక్ష్యానికి గురవుతోంది. గుప్త నిధుల వేట.. కబ్జాదారుల స్వార్థం.. అధికారుల అలసత్వం.. వెరసి.. ఆనాటి సంస్కృతులను ప్రతిబింబించే అద్భుత కట్టడం కాలగర్భంలో కలిసిపోతోంది. అపురూపమైన శిల్ప కళా సంపద కనుమరుగైపోతోంది. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన సంపదను భావితరాలు భౌతికంగా తిలకించలేని దుస్థితి నెలకొంది.

● ఉనికి కోల్పోయిన గత వైభవం..

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయుల సామ్రాజ్యానికి కోట వేదికగా నిలిచింది. సింగమ మహారాజు రాచర్ల పట్టణాన్ని పరిపాలించాడని చారిత్రక ఆధారాలున్నాయి. ఆసమయంలో చారిత్రక కట్టడాలు, దేవాలయం నిర్మించారు. అద్భుత శిల్ప కళాకృతులు రూపొందించారు. శత్రురాజుల దాడి నుంచి రాజ్యాన్ని కాపాడుకోవడానికి కోట చుట్టూ ఎత్తయిన ప్రహరీని నిర్మించారు. దానికి అవతలి వైపు కోట చుట్టూ తీసిన లోతైన కందకంలో ఎల్లప్పుడు నీరు ఉండేలా చేసి శత్రు దుర్భేద్యంగా మార్చారు. కోటకు పడమర దిశలో ఉన్న సింహద్వారానికి (వెనుక దిడ్డి) ఆనుకుని ఓ చెరువు, ద్వారం పక్కనే


శిథిలమైన శివాలయం

అబ్బురపరిచే రాతి శిల్పాలతో నిర్మితమైన శివాలయం ఉన్నాయి. సింగమ మహారాజు కోటలోని రహస్యాన్ని తెలుసుకున్న గోల్కొండ రాజు దండయాత్ర చేసి సామ్రాజ్యాన్ని అంతం చేశాడని చరిత్రకారులు చెబుతున్నారు. శతాబ్దాల కాలం నాటి శిల్ప కళా నైపుణ్యం మధుర స్మృతులు కాలక్రమేణా కనుమరుగైపోయాయి. కోటలోని కళా ఖండాలను నిజాం సర్కారు హైదరాబాద్‌లోని సాలార్జంగ్ మ్యూజియానికి తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు. మరికొన్ని రాతి స్థూపాలను చుట్టు పక్కల గ్రామాల్లోని ఆలయాల నిర్మాణాలకు వినియోగించారు. శిల్ప కళా సంపద అవశేషాలు కోటలో అక్కడక్కడా విసిరేసినట్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. నాటి సంపద కోటలో మిగిలిపోయిందని కొందరు గుప్త నిధుల కోసం ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన సంఘటనలు ఉన్నాయి. సాంస్కృతిక ఆనవాళ్లను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని చరిత్రకారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

● గ్రామాలకు ముందు 'రాచర్ల'

గోల్కొండ రాజు కోటపై దండయాత్ర చేయడంతో ప్రజలు ప్రాణభయంతో పారిపోయి పరిసర ప్రాంతాల్లో స్థిర నివాసాలను ఏర్పర్చుకున్నారు. దాంతో ఆ గ్రామాల పేర్లకు ముందు 'రాచర్ల' చేరిపోయింది. తద్వారా వెలసిన రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, రాచర్ల తిమ్మాపూర్, రాచర్ల గుండారం గ్రామాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రాచర్ల కోటలో చారిత్రక సంపదను రక్షించాలని స్థానికులు, చరిత్రకారులు కోరుతున్నారు.

మా ఇంటి పేరే రాచర్ల..

- రాచర్ల రఘురామశర్మ, పురోహితుడు, రాచర్లగొల్లపల్లి



రాచర్ల కోట సింగమ మహారాజు పరిపాలనలో తమ వంశస్థులు గురువులుగా ఉన్నారని మా తాతలు చెప్పేవారు. రాచర్ల కోటలో గురువులుగా ఉండడం వల్ల మా ఇంటి పేరు రాచర్లగా మారిందని చెబుతుండేవారు. అప్పటి నుంచి మా ఇంటి పేరు రాచర్లగా వస్తోంది.

కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

- వాసరవేణి పర్శరాములు, పరిశోధకులు, సింగారం



రాచర్ల కోటను అధికారులు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. చారిత్రక సంపదను కాపాడడంతో పాటు కోట ప్రాంతంలోనే మ్యూజియం ఏర్పాటు చేయాలి. నాటి శిల్ప ఖండాలను భద్రపరిస్తే భవిష్యత్తు తరాలకు గత చరిత్ర తిలకించే, తెలుసుకునే అవకాశాలుంటాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎఫ్‌వో


పెద్దపులి అడుగులను పరిశీలిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల డీఎఫ్‌వో ఎం రవిప్రసాద్ సూచించారు. రెండురోజుల క్రితం మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో గుడిసెలో కట్టేసిన ఆవు పెద్దపులి దాడిలో మృతి చెందింది. శనివారం జగిత్యాల డీఎఫ్‌వో అటవీ అధికారులతో పెద్దపులి సంచరించి, ఆవుపై దాడిచేసిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో గ్రామస్థులతో మాట్లాడుతూ బాధితుడికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందిస్తామన్నారు. సంఘటన స్థలంలో పెద్దపులి అడుగులు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. పొలాలకు వెళ్లేటప్పుడు ఎక్కువ మంది కలిసి వెళ్లాలన్నారు. అనంతరం కొడిమ్యాల రేంజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దపులి తిరిగిన ఆనవాళ్లు ఎక్కడ కనిపించినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి భయాన్ని పెట్టుకోవద్దని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వోలు ముషీర్‌అహ్మద్, మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్నమ్మ, సుబ్బారావు, బీట్ అధికారులు ఆనందరావు, ప్రవీణ్, అశ్విని, ఫిరోజ్, ఉన్నారు.

25 రోజులు.. నలుగురు ఈవోలు

- కొండగట్టు దేవస్థానంలో నియామకం
- ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణప్రసాద్


డి కృష్ణప్రసాద్

మల్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో 25 రోజుల వ్యవధిలో నలుగురు ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా శనివారం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా డి కృష్ణప్రసాద్ చేరారు. ఈనెల 3న ఇక్కడి ఈవో రామకృష్ణరావు బదిలీతో వేములవాడ ఈవో వినోద్‌రెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో ఈవోగా టి శ్రీకాంతరావును దేవాదాయశాఖ నియమించగా ఈనెల 18న విధుల్లో చేరారు. అనంతరం మూడు రోజుల్లోనే నెలరోజుల సెలవుపై వెళ్లారు. తాజాగా హైదరాబాద్‌లో దేవాదాయశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డి కృష్ణప్రసాద్‌ను ఇన్‌చార్జి ఈవోగా నియమించడంతో శనివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇరవైఐదు రోజుల్లో నలుగురు ఈవోలు బాధ్యతలు చేపట్టినట్లు అయింది. అంతకుముందు ఈవో కృష్ణప్రసాద్ ఆలయంలో అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కృష్ణప్రసాద్ గతంలో ఇక్కడ రెగ్యులర్ ఈవోగా విధులు నిర్వహించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

- బాలికల విభాగంలో రూరల్ చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్



ట్రోఫీతో కరీంనగర్ పాలిటెక్నిక్ కళాశాల బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. రెండు రోజులుగా జిల్లా కేంద్రానికి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల కరీంనగర్, బాలుర విభాగంలో ఎస్సారార్‌ఎస్ పాలిటెక్నిక్ కళాశాల సిరిసిల్ల ఓవరాల్ చాంపియన్ షిప్‌లను సాధించాయి.

పోటీల ముగింపు సమావేశా నికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి శివరాణి హాజరై విజేతలకు బహుమతులను, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు భవిష్యత్తులో చిన్న చిన్న విషయాలకు కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అధికారులందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించామన్నారు. 600 మంది క్రీడాకారులు రెండు రోజులపాటు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, తదితర క్రీడాంశాల్లో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు కే వెంకటేశ్వర్లు, ఎం చంద్రప్రకాశ్, బి ఝాన్సీ, సీహెచ్ స్వప్న, ఏవో నజీముద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ జి తుల్జారాం షా, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో హెచ్‌ఎంకు బహుమతి


బహుమతి అందుకుంటున్న హెచ్‌ఎం

రాయికల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరురాష్ట్రాల దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాయికల్ మండలం కుమ్మరిపెల్లి ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ బహుమతి అందుకున్నాడు. ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అభయ్ రాజ్ రూపొందించిన తక్కువ ఖర్చు, ఖర్చు లేని బోధనోపకర ణాలతో కూడిన సూపర్ సైన్స్ కిట్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రియదర్శిని, జాయింట్ డైరెక్టర్ శివగామి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. అభయ్‌రాజ్‌ను జిల్లా విద్యా శాఖాధికారి రాము, జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందించారు.

త్యాగధనుల స్మరణ.. కొలనూరులో కొనసాగుతున్న నిత్య జనగణమన


కొలనూరులో నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కొలనూర్‌లో మొట్టమొదటిసారిగా త్యాగధనులను స్మరిస్తూ నిత్య జనగణమనను గ్రామస్థులు కొనసాగిస్తున్నారు. కోనరావుపేట మండలం కొలనూరులో 2018లో నిత్య జనగణమన కార్యక్రమాన్ని అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆనాటి నుంచి నిత్య జనగణమనను కొనసాగిస్తున్నారు. ఉదయం 8 గంటలకు గ్రామపంచాయతీ మైకు ద్వారా జనగణమన సైరన్ రాగానే ఎక్కడ ఉన్న గ్రామస్థులు అక్కడే నిలబడి నిత్య జనగణమనలో పాల్గొంటున్నారు. అప్పటి సర్పంచ్ అబ్దుల్ రషీద్, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, ఇతర అధికారుల సమక్షంలో జనగణమన ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతోంది.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


ధర్మపురి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్థానిక లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

● అంజన్న ఆలయంలో..

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తులతో రద్దీ నెలకొంది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● 30న హుండీల లెక్కింపు

ఈ నెల 30 ఆలయ హుండీల ఆదాయంను లెక్కింపు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇటీవల ఈవో మార్పుతో లెక్కింపునకు ఆలస్యం కాగా నూతన ఈవో బాధ్యతలు చేపట్టడంతో గురువారం లెక్కింపునకు నిర్ణయించారు.


కొండగట్టు అంజనేయస్వామి ఆలయ ఆవరణలో భక్తులు

మొక్కజొన్నలో కత్తెర పురుగు

- పీచు దశలో దెబ్బతింటున్న పంట
- మందులు పిచికారి చేసినా అదుపు కావడం లేదంటున్న రైతులు


సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్‌లో పీచు దశకు చేరుకున్న మొక్కజొన్న


మొక్కజొన్నను తింటున్న కత్తెరపురుగు

సైదాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట పీచుదశలో కత్తెర పురుగు సోకుతోంది. పురుగు మందులు పిచికారి చేసినా కత్తెర పురుగు అదుపు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడంతో చాలా మంది రైతులు ఆరుతడి పంట అయిన మొక్కజొన్న పంట సాగు చేశారు. పత్తి పంట చేతికి రావడంతో ఆ మొక్కలు తీసివేసి మొక్కజొన్న వేశారు. మండలంలో ఈ యాసంగి సీజన్‌లో నాలుగువేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోంది. వాతావారణ పరిస్థితో.. మరే కారణమో.. మొక్కజొన్నకు పీచుదశలో కత్తెరపురుగు సోకింది. ఈ పురుగు మొక్కజొన్న కర్రలను పూర్తిగా తినేస్తోంది. ఆ కత్తెర పురుగు సోకిన కర్ర స్ప్రే చేసినా కోలుకునే అవకాశం లేదు. రెండున్నర నెలలుగా కష్టపడి మొక్కజొన్నను పీచు దశకు తీసు వస్తే చివరిదశలో కత్తెరపురుగు రావడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంకో నెల రోజులు అయితే పంట చేతికి వచ్చే సమయంలో చీడ పీడలు ఆశించడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.

● కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సైదాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి వైదేహి వివరించారు.

- మొక్కజొన్న విత్తిన వెంటనే ఎకరానికి 10-15 లింగాకార్షన బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.
- విత్తిన 7-10 రోజుల తర్వాత వేప నూనె (అజాడిరక్టిన్ 1500 పీపీఎం) లీటర్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి మందు మొత్తం మక్క సుడులలో పడే విధంగా పిచికారి చేయాలి.
- పురుగు తీవ్రతను బట్టి పంట విత్తిన 20-25 రోజుల తర్వాత క్లోరాంట్రానిలిప్రొల్ 80 మిల్లీలీటర్లు, వేపనూనె (అజాడిరక్టిక్ 1500 పీపీఎం) ఒక లీటరు, 200లీటర్ల నీటిలో కలిపి మొక్కలు మొత్తం పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.
- పురుగు కనిపించిన వెంటనే పొడి ఇసుకను మొక్కజొన్న సుడులలో చల్లితే ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి. చిక్కటి ఎర్రమట్టి బురద నీటిని మొక్కజొన్న మొక్క మొవ్విలో పోస్తే కత్తెర పురుగు లార్వాలు ఊపిరి ఆడక చనిపోతాయి.
- ఎదిగిన లార్వా నివారణకు విషపు ఎరను మొక్క సుడిలో ఏర్పాటు చేసుకోవాలి

● విషపు ఎర తయారీ విధానం:

ఎకరానికి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం తీసుకొని బెల్లాన్ని 2-3 లీటర్ల నీటిలో కరిగించి తవుడులో కలిపి 24 గంటలు పులియనివ్వాలి. అరగంట ముందు ఈ మిశ్రమానికి వంద గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి విషపు ఎరను మొక్క సుడిలో వేయాలి.

● జీవనియంత్రణ పద్ధతులు

కత్తెర పురుగు నివారణకు జీవ కీటక నాశినులైన నోమేరియా రిలే లేదా మెటారైజియం ఎనైసోప్లియె లేదా బివేరియా బాసియాన లేదా ఈపీఎన్ 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి సాయంకాలం వేళలో పిచికారి చేయాలి.

కత్తెర పురుగు అదుపు కావడం లేదు

- ఆవుల రాజు, మొక్కజొన్న రైతు, జాగీర్‌పతి



నాలుగు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాను. విత్తనాలు వేసినప్పటి నుంచి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. మొక్కజొన్న ఏపుగా పెరిగి పీచు దశకు వచ్చింది. ఈ దశలో కత్తెర పురుగు సోకి ఆకులు, చెట్లను పూర్తిగా తింటోంది. మూడు సార్లు పురుగు మందు స్ప్రే చేశాను. అయినా అదుపు కావడం లేదు. అధికారులు స్పందించి కత్తెరపురుగు అదుపు చేసేందుకు తగిన మార్గం చూపించాలి.

నేటి నుంచి ఖనిలో తాజుద్దీన్ బాబా జన్మదిన వేడుకలు

కళ్యాణ్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): హజ్రత్ తాజుద్దీన్ బాబా జన్మదిన వేడుకలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు దర్బార్ నిర్వాహకుడు నారదాసు సతీష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సందల్ గంధం ఊరేగింపు గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి కొనసాగుతుందని, మంగళవారం దర్బార్‌లో సహపంక్తి భోజనాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వృద్ధుడి కుటుంబానికి ఆర్థికసాయం

రామగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామానికి చెందిన వృద్ధుడు ఎనమనగండ్ల రాములు (106) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం మాజీ జడ్పీటీసీ వెంకటరమణరెడ్డి రూ.2వేలు, రేండ్ల శారద కుమారస్వామి రూ.5 వేలు అందజేశారు.

బడీడు పిల్లల గుర్తింపు

సుల్తానాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సుద్దాల గ్రామ పరిధిలో ఉన్న ఇటుక బట్టీల లో విద్యా శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. దాదాపు 20 మంది పిల్లలను గుర్తించామని మండల విద్యాధికారి రాజయ్య తెలిపారు. వీరికి ఇటుక బట్టీల ఆవరణలో వసతులతో కూడిన పాఠశాలను ఏర్పాటు లేదా ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయించాలని ఆదేశించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్నారు. అందరితో ఓటు హక్కు విని యోగం సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగ కుండా ఓటు వేయాలన్నారు. నూతనం గా ఓటు హక్కు పొందిన యువత ను కలెక్టర్ అభినందించి ఓటర్ కార్డులు అందజేశారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటర్లకు ఓటు హక్కు పత్రాలను అందించారు. ప్రజలను చైతన్య పరిచి వారికి ఓటు విలువపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మార్వో ఆరీఫోద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ చౌర స్తా వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డి.టి ఉదయ్, ఆర్.ఐ. వరలక్ష్మి, హెచ్ఎం. మాధవిలత, ప్రజాప్రతినిధులు రూప్లానాయక్,



మంథనిలో ఓటరు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో సురేష్, ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,ఉద్యోగులు

లింగాయ్య, తిరుపతి రెడ్డి, పాల్గొన్నారు.

మంథని (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్య పడుతుందని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమం జరి గింది. తహసీల్దార్ రాజయ్య, డీటీ గిరి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం- గణతంత్ర దినోత్సవ ఆవిర్భావం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సత్యప్రకాష్, బోగోజు శ్రీని వాస్, కొండేల మారుతి, సామల అశోక్‌లు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో ఓటర్ దినోత్సవం నిర్వహించారు. ముగ్గులపోటీ, కొత్త ఓట ర్లు, సీనియర్ సిటిజన్‌లను సన్మానిం చారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రావు, జ్ఞానే శ్వర్, గిర్దావర్ జయలక్ష్మి, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓట ర్ల దినోత్సవంలో భాగంగా అధికారులు ఓటు ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహిం చారు. తహసీల్దార్ యాకయ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినో త్సవం నిర్వహించారు. విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంఈవో మహేష్, ఆర్ఐలు అజీమ్, రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ నిహారిక, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): ఓటు జన్మహక్కు అని తహసీల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు. జిల్లా పరిషత్ పాఠ శాల నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో లలిత, ఎంఈఓ విజయ్‌కుమార్, సీనియర్ అసి స్టెంట్ సతీష్, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు

కోల్‌సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు పథకాలు రావని ఆందోళన చెందవద్దని, ప్రతిపక్షాల మోసపు మాటలు నమ్మవద్దని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని సీతానగర్, మల్లికార్జున్‌నగర్‌లో రూ.3కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయన్నారు. రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే వార్డు సభలు పెట్టామన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో రూ.300కోట్లతో



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, రామగుండంలో విద్యుత్ కేంద్రం, బండల వాగు ప్రాజెక్టు ప్రారంభానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మేయర్ అనీల్ కుమార్, ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నెలకంటి రాము, గోపాల్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, నియమాలు పాటించాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హరిశంకర్ సూచించారు. శనివారం టాటా ఏఐసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అడ్డగుంటపల్లి ఆర్యవైశ్య భవనం నుంచి ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు మద్యం సేవించరాదని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, న్యాయవాది అమరేందర్‌రావు, సుధాకర్, నటరాజ్ శేఖర్, కోలేటి శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

లక్ష డప్పుల లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయాలి

మంథని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాదిగలు, ఉప కులాల సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పుల లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంథని సామ్యేల్ పిలుపునిచ్చారు. శనివారం జరిగిన రౌండ్ సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా మాదిగ, ఉప కులాల తీరని ద్రోహం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు చందు మాదిగ, బూడిద తిరుపతి, బూడిద రాజయ్య, మంథని లక్ష్మణ్, ముత్యాల లింగయ్య, మహేష్, ప్రసాద్, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెద్దపల్లి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామంలో శనివారం ఉచిత గుండె, కంటి వ్యాధుల నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలసాని లెనిన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులునేత్ర వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్ సహకారంతో ఫార్చున్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు షుగర్, బిపి , ఇసిజి, 2 డి ఎకో ,కంటి పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సబ్బు రాజకుమారి, సతీష్, మెడికేర్ క్యాంపు ఇంచార్జి గజవెల్లి గణేష్, గ్రామ యువకులు దబ్బేట అనిల్, మెట్టు రాజేందర్, బన్నిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎలిగేడు, జనవరి25 (ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శనివారం లాలపల్లిలో నిర్వహించిన ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. 1954లో ప్రారంభమై ఎలిగేడు ప్రాథమిక సహకార సంఘం రైతులకు ఉత్తమ సేవలు అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. నాలుగు గోదాములు నిర్మించడం శుభపరిణామమని, స్థలం సేకరించికుంటే లాలపల్లిలో గ్రామపంచాయతీ భవనం, మహిళాస్వశక్తి భవనం నిర్మాణాలకు నిధులు ఇప్పిస్తామని, త్వరలోనే వాటర్‌ప్లాంట్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, అసిస్టెంట్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో రూ.20లక్షలతో నిర్మాణం చేపడుతున్న హెల్త్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ, ప్రాథమిక వ్యవసాయ సహకారి సంఘం ఆధ్వర్యంలో రూ.14.50లక్షలతో గోదాంను ప్రారంభించారు. లాలపల్లిలో రూ.19లక్షలతో



నర్సాపూర్‌లో ఆరోగ్య కేంద్ర భవనానికి భూమిపూజచేస్తున్న ఎమ్మెల్యే

నిర్మించిన గోదాం, ఉపాధిహామీ నిధులు రూ.10లక్షలతో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. డిఎంహెచ్‌వో అన్న ప్రసన్న, డాక్టర్ నిస్సిక్రిష్టాన, హెల్త్ సిబ్బంది నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి కర్తవ్యం

ఓదెల, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. కొలనూర్ హైస్కూల్‌లో కరీంనగర్ ప్రతిమ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనైనా చేయగలుగుతామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన 1500 మంది హాజరై, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, చీకట్ల మొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవీందర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, మాజీ సర్పంచులు సామ శంకర్, కుంచం మల్లయ్య, బొంగోని రాజయ్య గౌడ్, కొల్లూరి చందు, వైద్యులు మేఘన, సౌమ్య, శ్రీవాస్తవ్, మురళి, విజయ్ కుమార్, వైశాలి, అఖిల తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బొమ్మలకొలువు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్లబ్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఎన్ సీఓఏ క్లబ్‌లో మహిళాసభ్యులు శనివారం ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఆకట్టుకున్నది. అరసువెల్లి సత్యనారాయణ స్వామి ఆలయ నమూనాను ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అమ్మవార్లు, సంక్రాంతి లక్ష్మి, గొబ్బెమ్మ, బతుకమ్మ, సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు పర్యావరణ పరిరక్షణ, పల్లె వాతావరణం ఉట్టిపడేలా చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల్లో క్లబ్‌సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యాలతో మహిళలు సరదాగా ఆడిపాడారు. ఆర్జీ-2 సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య, సునీత వెంకటేశ్వర్‌రెడ్డి, క్లబ్ సెక్రెటరీ కల్పనతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి స్మారకార్థం వైద్య శిబిరం

పెద్దపల్లిటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని 4 వ వార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా యాన స్మారకార్థం శనివారం మున్సిపాల్టీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యాతిధిగా హాజరైన ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్న అనంతరం మాట్లాడారు.

ఎన్టీపీసీలో ముగిసిన వర్క్‌షాప్

జ్యోతినగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెమ్(గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్ 2024 శీతాకాలపు వర్క్‌షాప్ శనివారం ముగిసింది. గతేడాది మేలో జెమ్‌లో శిక్షణ పొందిన బాలికలకు ఐదు రోజులపాటు మరోసారి ప్రత్యేక శిక్షణనిచ్చారు. ఎన్టీపీసీ సీజీఎం(హెచ్‌వోపీ) చందన్ కుమార్ సామంత హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగల జీఎంలు, అధికారులు, రాఖీ సామంత, సభ్యులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

గోదావరిఖని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సింగరేణి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లపై ఆర్జీ-1 ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్ శనివారం పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎస్ఓటూ జీఎం మాట్లాడుతూ రిపబ్లిక్ డే వేడుకలను విజయవంతం చేయలని, స్టేడియంలో పరేడ్ కోసం మార్చ్‌ఫాస్ట్, జాతీయ గీతాల మీదా సాంస్కృతిక కార్యక్రమాలకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని, అందరికి అనుకూలంగా సీటింగ్, వీఐపీలకు ప్రత్యేక సీటింగ్, ఉత్తమ ఉద్యోగులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సారి జరుగే వేడుకలు అత్యంత వైభవంగా అంగరంగా వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అధికసంఖ్యలో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొననున్న నేపథ్యంలో ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏజీఎం(ఐఈడీ) అంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం అంజనేయ ప్రసాద్, డీజీఎం(పర్సనల్) డీ కిరణ్ బాబు, అధికారులు ఎస్ఈ వర ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సారంగపాణి, శ్రావణ్ కుమార్, హన్మంతరావు, శ్రీనివాస్, ఉమేష్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఓటూ జీఎం, అధికారులు



గణతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ 3 డివిజన్ పరిధిలోని సెంటినరికాలనీలోని రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల ఏర్పాట్లను శనివారం రామగుండం 3 ఏరియా జీఎం నరేంద్ర సుధాకర్‌రావు పరిశీలించారు. పరేడ్, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్‌వోటు జీఎం రఘుపతి, సివిల్ డిజియం రాజేంద్రకుమార్, పర్సనల్ విభాగాధిపతి బి సుదర్శనం అధికారులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు భాగస్వాములు కావాలని ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. అబ్దుల్‌కలాం స్టేడియంలో ఉదయం 10 గంటలకు జరిగే ఉత్సవాలకు జీఎం వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. జాతీయ జండా ఆవిష్కరణ, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్యంపై కార్మికులకు అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గనిలో శనివారం కార్మికులకు ఆరోగ్యంపై ఏరియా వైద్య అధికారి పద్మ అవగాహన కల్పించారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సరిపడా నిద్ర ఉండాలన్నారు. గని మేనేజర్ రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, డీవైపీఎం శ్యామ్‌ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్మికులు వీరే...



వెంకటేశ్వర్లు శంకరయ్య రాజారామ్ ఉదయ్‌భాస్కర్ టీ లింగయ్య ముత్తయ్య షేక్‌అబ్దుల్‌నదీం సదన్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఆర్జీ-2 ఏరియాకు చెందిన ఉత్తమ ఉద్యోగులకు యాజమాన్యం ఎంపిక చేసింది. ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికైన కామ వెంకటేశ్వర్లు(ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3), ఉత్తమ అధికారిగా కే శంకరయ్య(డిప్యూటీ మేనేజర్, ఓసీపీ-3), ఉత్తమ సూపర్‌వైజర్‌గా రాజారాం(సీనియర్ మైనింగ్ సర్దార్, వీకేపీ) లు ఎంపికయ్యారు. వీరిని కొత్తగూడెంలో జరగనున్న సింగరేణి ప్రధాన ఉత్సవంలో సీఎండీ సన్మానించనున్నారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎం ఉదయ్ భాస్కర్ (అసిస్టెంట్ చైన్‌మెన్, ఓసీపీ-3), తుంగపిండి లింగయ్య(ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3), సీహెచ్ ముత్తయ్య(ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్, వీకేపీ), షేక్ అబ్దుల్ నదీమ్(కంటిన్యూస్ మైనర్ ఆపరేటర్, వీకేపీ), బాదె సదన్‌కుమార్ (జనరల్ మజ్దూర్, సీహెచ్‌పీ)లు ఎంపికయ్యారు. వీరిని అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగే గణతంత్ర వేడుకల్లో జీఎం సన్మానించనున్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఆర్జీ 3, ఏపీఏ డివిజన్ పరిధిలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేస్తూ జీఎంలు సుధాకర్ రావు, వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ 3 ఉత్తమ అధికారిగా ఓసి 2లో సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా టి నాగేశ్వరరావు, ఉత్తమ సింగరేణియన్‌గా ఓసి 1లో హెడ్ ఓవర్‌మెన్ డి తిరుపతిరావు, అడ్రియాల ప్రాజెక్టు ఉత్తమ అధికారిగా డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె శ్రీకాంత్, ఉత్తమ సింగరేణియన్‌గా ఎస్‌డిఎల్ ఆపరేటర్ మేకల రమేష్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో జరిగే వేడుకల్లో సీఎండీ సన్మానిస్తారని తెలిపారు. అదే విధంగా ఆర్జీ 3 ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఓసి1లో ఈపి ఆపరేటర్ పిరాజిరెడ్డి, ఫోర్‌మెన్ (మెకానికల్) బుర్ర రాజు, సిహెచ్‌పీలో కన్వేయర్ ఆపరేటర్ కెకిషన్, ఓసి2 లో జనరల్ మజ్దూర్(హెమ్) సత్రం సమ్మయ్య, ఫోర్‌మెన్ (మెకానికల్) కత్తుల రాజు, అడ్రియాల ప్రాజెక్టు ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆకునూరి సుమన్, మల్టీ జాబ్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న మొహమ్మద్ అజీద్ ఎంపికయ్యారని, వీరిని వేడుకల్లో సన్మానిస్తామని తెలిపారు.

దరఖాస్తుల వెల్లువ

(5వ పేజీ తరువాయి)

వేలు ప్రభుత్వం ఇవ్వనున్నది. సర్వే అనంతరం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో 80 వేల మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. ఆత్మీయ భరోసాలో కూడా లబ్ధిదారుల జాబితా తగ్గింది. మూడు రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల జాబితాలను ప్రకటించగా, పలువురు తమ పేర్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జాబితాలో తమ పేరు ఎందుకు లేదని గ్రామ, వార్డు సభల్లో ప్రజలు అధికారులు, సిబ్బందిని నిలదీశారు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని ప్రభుత్వం పరిశీలిస్తుందా లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నుంచి మొదటి విడతలో ఎంపికయ్యే లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సన్మానాలు.. భావోద్వేగాలు...

5వ పేజీ తరువాయి



సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజమల్లును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, రాజమల్లు అధ్యక్షతన నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం ప్రజల మధ్య ఉండేలా వ్యవహరిస్తే భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదుగుతారని అన్నారు. అనంతరం చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, కౌన్సిలర్లను మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మానించారు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ,మేనేజర్ అలీముద్దీన్ తో పాటు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశానికి హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, నాయకులు పాలకవర్గాన్ని సన్మానించారు. ఎమ్మెల్యే విజయరమణరావు తోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ వైస్ చైర్ పర్సన్ తో పాటు పాలకవర్గ సభ్యులు శాలువాలు , పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

నాలుగు ఎజెండా అంశాలకు ఆమోదం

కోల్‌సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి):కార్పొరేషన్ చివరి సమావేశంలో నాలుగు ఎజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. కార్పొరేషన్‌లో 12 అద్దె వాహనాలను 12నెలల కాలానికి సమకూర్చుకొనుటకు రూ.23.76 లక్షల కేటాయించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు, 100 బస్సులకు డీజిల్, డ్రైవర్ల బత్తాలు, ఫ్లెక్సీలు రూ.10.15లక్షలు చెల్లించేందుకు, నగర పాలక సంస్థ ఖాళీ స్థలాలు, ఓల్డ్ అశోక థియేటర్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, పాత మున్సిపల్ ఆఫీస్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన మల్టీ పర్పస్ షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు పీపీపీ మోడ్‌లో అప్పగించుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

కార్పొరేటర్లకు సన్మానం

కార్పొరేషన్ పదవీకాలం పూర్తయిన మేయర్ బంగి అనీల్ కుమార్‌తో పాటు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సత్కరించారు. ఒక్కొక్కరికి వెండి జ్ఞాపికలను అందజేశారు. కమిషనర్ అరుణశ్రీ, సింగరేణి జీఎం లలిత్ కుమార్, రామగుండం తహసిల్దార్ కుమారస్వామి, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కంట తడి పెట్టిన కౌన్సిలర్



పారిశుధ్య కార్మికులతో కౌన్సిలర్ గాదె మాధవి భావోద్వేగం

పెద్దపల్లిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో 10వ వార్డుకు చెందిన గాదే మాధవి కౌన్సిలర్ కన్నీరు పెట్టారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. సభ ప్రాంగణంలో నేలపై వాలి కార్మికులకు నమస్కరించారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలను గుర్తు చేసుకొని ఉద్వేగానికి గురయ్యారు. తోటి మహిళా కౌన్సిలర్లు కూడా భావోద్వేగానికి గురయ్యారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

ధర్మారం జనవరి 25 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ ఆరీఫోద్దీన్, విద్యాధికారి పోతు ప్రభాకర్‌లు పరిశీలించారు. వంట కార్మికులకు శుచి శుభ్రత విషయంలో పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు మాధవి లత, పీఎం పోర్షన్ సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆర్‌పి వరలక్ష్మి, ఉపాధ్యాయులు వనపర్తి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి త్యాగాలు స్ఫూర్తిదాయకం

మంథని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల్లో విద్యావ్యాప్తికి రాజా వెంకటరామిరెడ్డి బహదూర్ చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. హనుమాన్ నగర్ సమీపంలోని రాజా వెంకటరామిరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ స్టేట్‌లో పేద ప్రజలకు విద్యను అందించడానికి దానాలు, ధర్మాలు చేసి విద్యా సంస్థలను నెలకొల్పారన్నారు. తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, లక్ష్మణ్, ఇర్ఫాన్, కుమార్, రాజబాబులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఓదెల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొండ్ర కొమురయ్య మృతిచెందగా ఆయన నేత్రాలను శనివారం కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి తరలించారు. ఫౌండేషన్ నిర్వాహకులు శ్రావణ్ కుమార్, భీష్మాచారి, డాక్టర్ వేణు, టెక్నికల్ నరేందర్, క్యాతం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామకృష్ణ, మేర్గు రంగం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించాలి

జూలపల్లి, జనవరి 25. (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైనా నిరుపేదలకు అందించి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిలుపుకోవాలని శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మహేష్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తహసీల్దార్ జక్కని స్వర్ణకు వినతిపత్రం అందజేసారు. నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, పెద్దోల్ల ఐలయ్య, శంకరయ్య, ఆంజనేయులు, నర్సయ్య, పెసరు మల్లేశం, బడుగు శ్రీనివాస్, శ్రీకాంత్, బొజ్జ సంపత్, నర్సింహచారి, సాగర్, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.